# బ్రతికేందుకు మరోదారి

మారెళ్ళ చంద్రమౌళి




భద్రాచలం పోవాలి అన్నకోరిక బలంగా చాలా ఏళ్ళుగా నాలో నాటుకుపోయింది. ఓరోజు అతిప్రయత్నంమీద బయలుదేరాను.

దూరంగా గుట్టమీద గుడిప్రాకారం కనిపించింది. ఇరుకైన తారురోడ్డు కిరువైపుల విదిలించి పారేసినట్టుగా కొన్ని యిళ్ళున్నాయి. వాటిలో తెచ్చిపెట్టుకున్న నాగరికత వెలుగుతోంది. అవిదాటేక కొన్నిసత్రాలు కనిపించాయి వాటిమీద విందుగా వాటిని కట్టించిన ధర్మదాతల పేర్లు చెక్కివున్నాయి.

## బ్రతికేందుకు మరోదారి

భక్తులెక్కువగానే అవూరు చేరారు. సత్రాల్లో ఖాళీలేవనిపించుకుని మరోదారికోసం ప్రయత్నిం చేను.

నాలుగ్గదులున్న పెంకుటింటిని సత్రంలా అద్దెకిస్తారని అక్కడికి వెళ్ళేను. వీధి చివరగా ఆ యిల్లుంది. కొన్ని గదులముందు పూరివాళ్ళు కూచుని వున్నారు. కొందరాడవాళ్ళు అక్కడే పళ్ళుతోముకుంటున్నారు. ఎగువనున్న పంపునీరు పోయేందుకు దారిలేక, జారుతూ పల్లంలోకి పారి పెంకుటింటి ముందున్న ఖాళీ స్థలాన్ని తడుపుతూ రోడ్డుమీదికి పాకుతూంది. అక్కడే ఒక గది దొరికింది. ఆ గదికి ఒక్కటే కిటికీ. అక్కడ మురికి వాసనేస్తూంది. గుడ్డిదీపం కూడా ఒకటుంది. ఆ గదిలో కూచునేందుకు వీలుందన్నట్టుగా అక్కడక్కడా గచ్చు మిగిలి ఉంది. దేవుణ్ణి చూడాలన్న తలంపుకన్నా ముందుగా ఆ మురికిలోంచి బైటపడాలన్న కోరిక బలంగా కలిగింది నాలో. ఉన్న కాస్సేపూ వెంటతెచ్చుకున్న సామాన్లు వుంచుకొనేందుకని అక్కడ వుండక తప్పలేదు.

* * *

దేవుణ్ణి చూసేందుకు డబ్బు కట్టాలి. లేదా పడిగాపులు పడివుండి ధర్మదర్శనం చేసుకోవాలి. స్తోమతకన్నా సమయమే సమస్యయింది నాకు. టికెట్టుకొని వంతుకోసం కాచుకుని వున్నాను.

గుడిముందు చాలామంది నిలుచుని వున్నారు. అందరూ భక్తులే. భక్తిమార్గంలోనూ ముక్తిమార్గంలోనూ తేడాలున్నాయి. ఆలయ ప్రాంగణంలో చిల్లరదేవుళ్లే చాలామంది కనిపించారు. ఆచార్లొకడు మడిబట్టలు కట్టుకుని, ఓ చేత నైవేద్యం పట్టుకుని చుట్టూవున్న దేవుళ్ళకు అర్పణ చేస్తున్నారు. మరో ఆచారిగారు చేతిలో చిన్న గంటను మోగించుకుంటూ ఆయన ముందుగావెళ్తున్నారు. గుళ్ళోగంటలు మోగుతూ వున్నాయి. అరుగులమీద చాలామంది ధర్మదర్శనం కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు ప్రదక్షిణలుచేస్తున్నారు. శ్రీరాముల వారికూడా నైవేద్య సమయం అయింది. అంతా హడావిడిగా వుంది.

మూలగా భక్తుదెవరోకొబ్బరిచిప్పను ముక్కలు చేయటం విన్పించింది. మూల మూలల్నుంచి కొందరుపిల్లలు పరిగెత్తుకుంటూవచ్చారు. అందులో ఎవ్వరూ అందంగా లేరు.

అందరికన్నా వయసులో పెద్దగా కనిపించే పిల్ల మరీ పీలగా వుంది. చాలీ చాలని పరికిణీ కట్టుకుంది. నల్లగా వుంది. తలకూడా మాసింది. చెదిరినజుత్తు అదృష్టానికి మారురూపుగా వుంది. ఆ పిల్లో కొబ్బరిముక్క అందుకుని అటుప్రక్కకు వెళ్ళిపోయింది.

ఆ జట్టులో కనిపించిన రెండో కాస్త్రీ ఆడో మగో తెలియని స్థితిలోవుంది. నడతనుబట్టి ఆడపిల్లే అన్పించింది. చాలా నెలలక్రితం వేసిన జడ. ఆ జడమీదుగా రెండుపిన్నులు. పూర్వం ఎప్పుడో తెల్లగా వుండేదన్పించే చొక్కాను వేసుకునుంది. పెద్దపిల్లను తోసుకుంటూ వచ్చిన రెండోపిల్లకూడా ఓ ముక్క దొరికింది. దొంగచూపులుచూస్తూ కొరుక్కుతింటూ పక్కకు పోయింది.

వంటికి బట్టలూ, జుట్టుకు తైల సంస్కారమూ ఆర్భాటము అవసరం లేకుండా తిరిగే మూడోకాస్త్రీ మొగాడు. చాలా అదృష్టవంతుడని పించింది. వయసు మరీ తక్కువ. చేతిలో ఓ చిన్న అరటిపండుముక్కవుంది. ఆ ముక్కకో వైపు ఎర్రటిమట్టి అతుక్కుంది. దాన్ని దులుపుకుంటూ, చేతికంటిన జిడ్డుని రెండు చేతులతోనూ ఒంటికే పులుముకున్నాడు.

ఇంతలో మరోజట్టు తోసుకుంటూ వచ్చింది. ఆ యిద్దరు పిల్లలూ చాకింటి బట్టలు కట్టుకుని తలలు చక్కగా దువ్వుకున్నారు. వాళ్ళూ అక్కడే పచార్లు చేయసాగేరు. చింకిబట్టల పిల్లల్తోపాటూ ప్రసాదం తీసుకోబోయారు. వాళ్ళు చీదరించుకున్నారు. పెద్దపిల్ల వీళ్ళను రక్కుతానన్నట్టు భయపెట్టింది. తరిమింది. బినా ఓ కొబ్బరిముక్క సంపాదించుకుని పారిపోయాడో పిల్లాడు. మరో కుర్రాడు భయంతో ముందే పరిగెత్తిపోయాడు.

గంటలు మోగడం ఆగిపోయింది. గుడి తలుపులు తెరిచారు. బిలబిలమంటూ జనం ధర్మదర్శనానికి లోనికిచొచ్చుకుపోయారు. మరో మూల ఓ ఆచార్లు పులిహారాయంతేసి ప్రసాదం పంచటం మొదలెట్టేరు. చాలామంది భక్తులు అటువేపు నడిచారు. చింకి బట్టల పిల్లలటువేపు తోసుకుంటూ పరిగెత్తారు. ముగ్గురూ ప్రసాదాలందుకుని తిన్నారు. కళ్ళకద్దుకునే ఆచారం వాళ్ళ ఆకలి ముందు నిలవలేదు. ప్రసాదం గిన్నె ఖాళీ ఔతోంది.

ఆచార్ల కేక వినిపించింది.

'ఆ గిన్నెలోని ప్రసాదం దీన్లో కొద్దిగా వదేసి మిగతాది పట్టుకెళ్ళరా'

ఆయనెవరో కొంత పులిహోరను ఆచార్ల గిన్నెలో వదేసి బైటికి నడిచారు. ఆ ప్రసాదం గిన్నెలు ఎటు పోతున్నాయో తెలుసుకోవాలని పించింది. ఆనవాయితీగా పూజార్ల యింటికెళ్ళే ప్రసాదమే కాకుండా చాలా భాగం పరోక్షంగా కూడా పోతుందట. ఓ గిన్నెడు ప్రసాదం మాత్రం అమ్ముతారట. ఈ విషయం తెలిసే సరికి ప్రసాదం పంచటం పూర్తయింది.


శ్రీ వాణీ సాహిత్య పదావళి - 2

చొళ్ళంగిపేట పోస్టు: వయా : కాకినాడ, తూ.గో. జిల్లా

(సుప్రీంకోర్టు తీర్పు ననుసరించి నిర్వహించబడుతున్న సాహిత్య పోటీ)

**రు. 3000 లు పోటీ చేసి గెలుపొందండి!**

ముగింపు తేదీ 10–6–71 ప్రవేశ రుసుము రు. 1–00

కీ సొల్యూషన్ 15–6–71 "ఆంధ్రజ్యోతి" దినపత్రికలో

క్లూ 6 మాత్రమే: (ఎ) ఆల్ కరెక్టు రు. 2000 (బి) ఒక తప్పుకు రు. 700 ప్రతి 4 కూపనులకు 1 కూపన్ ఉచితం. అందరికంటె ఎక్కువ కూపనులు పంపినవారికి ప్రథమ బహుమతి రు. 200. ద్వితీయ బహుమతి రు. 100 ఇవ్వబడును. బహుమతి డబ్బు ది 20–6–71 M. O. ద్వారా పంపబడును.

ఆధారములు : (1) చిత్రమైనదీ జీవితం/ప్రపంచం. (2) జీవితం/ప్రపంచంలో కొంతమంది కొన్ని పనులే చేయాలని భగవంతుడు శాసిస్తాడనుకోవడం పొరపాటు. (3) జీవితం/ప్రపంచంలో మానవుడికి పరిపూర్ణమైన ఆనందం కలిగించే దేమీలేదు. (4) ఈ జీవితం/ప్రపంచం మహారంగస్థలం. దానిమీద మన మందరం నటీనటులం. (5) జీవితం/ప్రపంచంలో ఎనెన్నో విషయాలు నమ్మశక్యం కానంత అద్భుతంగా జరుగుతుంటాయి. జీవితం/ప్రపంచంలో ఖరీదు కట్టలేనివి చాలా వున్నాయి.

నిబంధనలు : (1) రచయిత(త్రి) వాడిన పదమే సరిఅయినది. (2) మీరు కోరుకున్న పదములు కాగితముపై వ్రాసి రుసుము M. O. ద్వారాగానీ, క్రాస్ చేయని I. P. O. ద్వారాగాని. కేష్ రశీదులుగాని పంపుతూ రశీదులు కూపనులకు జతపర్చిపంపవలెను. (3) ఒకరు ఎన్ని కూపనులైనా పంపి, ఎన్ని ప్రైజులైనా గెలుచుకొనవచ్చును. (4) కూపనులలో అడ్రస్సు విడిఅక్షరములతో వ్రాయవలెను. (5) ముగింపుతేదీ తరువాత మాకు చేరిన కూపనులు అంగీకరించబడవు. (6) మేనేజిమెంటువారిదే తుది నిర్ణయం. విజేతల లిస్టుకు 20 పై కవరు పంపవలెను. పోటీ నెం. 1 పదములు : కత్తికి, కాలదన్నలేము, శిల్పము, కళ, స్నేహం.

"వెధవ సంత. ఈ మాటు చేయి చాచేరంటే ఛంపేస్తాను. కొంపలో తిండి లేకపోయినా రోజూ యిక్కడికి తయారు. మీరేరా బ్రతక నేర్చినవాళ్ళు. "పొండి."— ధర్మ ప్రసాదం పంచే ఆచార్లు మండిపడుతున్నారు.

పెద్ద పిల్లా, చిన్నదీ బిక్కమొహం వేసుకుని గోడ కతుక్కుపోయారు. చిన్నది చేతి కతుక్కుని మిగిలిన పులిహోర మెతుకుల్ని తీసి నోట్లో వేసుకుంది. పెద్దది ఆవురావురు మంటూ ప్రసాదం కోసం ఎదురు చూస్తోంది.

కొంతమంది భక్తుల్ని దేవుడుబైటికి పంపేశాడు. అక్కడున్న దర్వాను టిక్కెట్టు కొనుక్కున్న వాళ్ళను గుళ్ళోపలికి పంపిస్తున్నాడు. ధర్మ దర్శనం ముగిసింది. నేనూ టికెట్టిచ్చి లోపలికి బయల్దేరేను. డబ్బు కట్టిన వాళ్ళందర్నీ దేవునికి దాదాపు ఐదు గజాల దూరంలో కూచోపెట్టేరు. ఓ అర గంటసేపు పూజా కార్యక్రమం జరిగింది. ఐదు రూపాయల విల్వ దైవ కారుణ్యంగా మారింది. డబ్బుతో కొనలేనిదీ రోజుల్లో ఏమీలేదనిపించింది

గుళ్ళోనుంచి బైటికి రాగానే కళ్ళు ఆ పిల్లల కోసం వెదికాయి. సంప్రదాయంగా గుళ్ళో కొంతసేపు కూచోవాలి. కానీ నే కూచున్నది మాత్రం కేవలం ఆ పిల్లలు కనిపిస్తారన్న కోరికతోనే.

ప్రక్కనున్న అరుగుమీద కొత్తగా పెళ్ళయిన దంపతులు కనిపించారు. అటు వేపుగా వచ్చిన స్త్రీ పెళ్ళికూతురువైపు నడిచింది. ఆమె అందంగా లేదు. చేతులకు రెండు మట్టిగాజులున్నాయి. కళ్ల చీకిరిగా వున్నాయి. కాలికి మెట్టెలు, మెడలో ఓ పసుపుతాడు, మాసినచీరె... పలకరింపుగా నవ్వి ఆమె అక్కడే కూచుంది.

"కొత్తగా పెళ్ళయినట్టుంది. కొడుకు పుట్టాలని కోరుకుంటున్నారా?" అని మళ్ళ నవ్వింది. కొత్త దంపతులు కొందంత సిగ్గుపడ్డారు.

"అంతేనమ్మా. కొత్తగా పెళ్ళయిన వాళ్ళందరు అలాగే కోరుకుంటారు...అన్నట్టు మీది వూరేనా?..."

"వూహూ కాదు" — అంది పడుచుపిల్ల.

"అల్లాగా. చాలా దూరంనుంచి వొస్తున్నట్టుంది...దర్శనం బాగా జరిగిందా?" ఆప్యాయంగా ప్రశ్నించింది.

"ఆ...బనా ఎంత జనం? అబ్బబ్బ..."

"ఇప్పుడేం చూశారు? ఇంకా పండుగముందు చూడాలి సూదిమొనకూడా నేల మోపేందుకు చోటుండదు... ఆ... ఏమమ్మోయ్?...కొబ్బరి కాయలు చాలానేకొట్టేవు...అ బ్బో......అన్నీ లేతకాయలేనే ... లేత కొబ్బరి చాలా రుచిగా




వుంటుంది కదండి. భలే యిష్టం లెండి నాకు ... మీకిష్టమేనా? —" నవ్వింది.

"ఇందులో విశేషమేమీ లేదులెండి. తెలిసిన వాళ్ళ పేరు మీద కూడా కొన్నికాయలు కొట్టేం అదీ కాక మొక్కుంటేమ...యింద. ఈ రెండు చిప్పలూ తీసుకోండి... మీదీవూరేనా...?"

"అబ్బే! ఎందుకండి..." మొహమాట పడిందామె.

"పిల్లలింటారెద్దురూ ... వుంచండి ప్రసాదం కద..."

"బనా ప్రసాదం యిస్తూంటే వద్దనకూడదు... మాకు కొబ్బరికేం లోటు లేదు. యిలాంటి వన్నీ రోజూ యింటికే వొస్తూంటాయి. పిల్లల కేం మహా రాజుల్లా తింటూవుంటారు... వాటి సంగతికేం కానీండి. దేవుణ్ని సరిగా చూశారా? ఆ సీతమ్మ నగలూ అవీ... ఎంత బావుంటాయో. చింతాకు పతకం లాంటిది నాకూ ఒహటుం దండి. అన్నీ వాడితే అనవసరంగా నల్లబడి పోవూ... ఎందుకని యింట్లో పడేస్తాను... అవతల చాలా పనుందమ్మా. వస్తాను..."

ఆమె కొంగుచాటుగా కొబ్బరి చిప్పల్ని దాచు కుంటూ, అడుగులు చకచకా వేసుకుంటూ బైటికి నడిచింది. నేనూ బయల్దేరేను పిల్లలెంతకీ కనిపించక.

గుడి వాకిట్లో మనుషులు గుంపుగా చేరేరు. ఏదో హడావిడి వినిపించింది ... మనుషుల మధ్య ఆ ముగ్గురు పిల్లలూ కనిపించారు. జుట్లు పట్టుకుని పోట్లాడుకుంటున్నారు. మూడోవాడు మధ్య నలుగుతున్నాడు. పెద్ద పిల్లా చిన్న పిల్లా వాణ్ని లాగుచుకోవాలని చూస్తున్నారు చిన్న దాని చొక్కా చినిగిపోయింది.

ఓసేవ్ నాగమణీ...కాంతమ్మా... ఏమైందే? వాణ్నలా చంపుతున్నారు? గట్టిగా కేకలు పెట్టు కుంటూ ఆమె పరుగెత్తుకుంటూ వచ్చింది. పెద్ద పిల్లల్నిద్దర్నీ చెరోవైపులాగింది.

"ఏమైందే నీ దుంప తెగా. ఎందుకే......నీ చొక్కా చించుకొన్నావెందుకే..." చిన్నదాని చెవి నులుముతూ అంది.

"అమ్మా అమ్మా...వూ...మరే..."ఏడుపు మొదలెట్టింది.

"అమ్మా...అమ్మా ఆ కొబ్బరిలాయావే..." ఆమెదగ్గరున్నకొబ్బచిప్పల్నిలాక్కుంది పెద్దపిల్ల

"ఒసే నీ దుంపతెగా...అదిల్లాయావే..."— పెద్దపిల్ల జనంలోకి పరిగెత్తింది. జనం మామూ లుగా తిరుగుతున్నారు, కొందరు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"వూవూ...ఎందుకూ, యివికూడా అమ్మ టానికేగా...మేంతెచ్చుకున్న ముక్కలుకూడా అమ్ముతావు. నేనివ్వను...నాకా కలేస్తోంది ..."

"తనను పట్టుకునే ప్రయత్నంచేస్తూ బతి మాలుకుంది తల్లి

"నా తల్లికదే... అమ్మకపోతే ఎలాగే... పాపం మీ నాన్నకు మందు కొనద్దూ?"

ఒక్కక్షణం ఆగిపోయాను...కొత్త దంప తులదగ్గర.ఆమె సంభాషణ గుర్తొచ్చింది. బతే...

"మరి ఆకలేస్తోందిగా" జాలిగా అడిగింది. చిన్నది ఏడుపు మొదలెట్టింది. దాన్ని మరోచేత్తో దగ్గరికి తీసుకుంది......

"అటుపొండే...అక్కడెవరో అరటి పండు తింటున్నారు. ప్రసాదం పెట్టారు" పెద్దదీ చిన్నదీ అటుకేసి పరిగెత్తేరు.

చిన్నవాడు ఏడిచిఏడిచి సొమ్మసిల్లి పోయాడు. వాణ్ణి భుజానవేసుకుని ఎవరూ లేని ఓమూలకెళ్ళిం దామె. అరుగుమీద కూచుంది. ఒళ్ళో వాణ్ని కూచోపెట్టుకుంది. స్తంభాని కానుకుని వాడి వైపు చూస్తూ వుంది. వాడు మగతగా కళ్ళు మూసుకున్నాడు. ఆమె కన్నులవెంట బీదరికం ప్రవహించింది. వాడిముడిచిన పిడికిలివిప్పింది. ఆమెచూస్తూన్న నాకందులో వుసిరికాయంత పులి హోర కనిపించింది. ●

## నరావతారం
(11వ పేజీ తరువాయి)

వైరస్‌లేకాదు, అన్నిరకాల వైరస్‌లు ఇలాగే తమతమ స్వభావాన్నిబట్టి తమకు తగిన జీవకణా లను ఎంచుకుని ముట్టడిస్తాయి. ఆ జీవకణాలను నాశనంచేసి ఇలాగే వృద్ధి చెందుతాయి. వైరస్‌లవల్ల వ్యాధులు కలగడం అంటె ఇదే. అసలు జీవకణాలను చంపి వైరస్‌లు వృద్ధి కావడమే వ్యాధి.

### వైరస్ కథ

అయితే జీవకణాన్ని వైరస్ ఎలా నాశనం చేస్తుంది:

జీవకణాన్ని వైరస్ అంటిపెట్టుకోవడం వరకు మనకు ఎలక్ట్రాన్ మైక్రోస్కోపులో కని పిస్తుంది. ఆతర్వాత జరిగేది బహుశా ఇది:—

జీవకణాన్ని వైరస్ తొక్కిపొడుస్తుంది. దాని ప్రోటీన్‌కవచం బయటే వుండిపోతుంది. న్యూక్లిక్‌యాసిడ్(డి ఎన్ ఎ లేదా ఆర్ ఎన్ ఎ) మాత్రం లోపలికి పోతుంది.

ఇక అక్కడ వైరస్ న్యూక్లిక్‌యాసిడ్‌కు, అసలు కణానికి చెందిన న్యూక్లిక్‌యాసిడ్‌కు మహాయుద్ధం జరుగుతుంది. అసలు న్యూక్లిక్ యాసిడ్ తన మానాన తన పనులు నిర్వర్తించు కోవాలని చూస్తుంది. కాని కొత్తగా చొరబడిన వైరస్ న్యూక్లిక్‌యాసిడ్ తన ఆజ్ఞలనునిర్వర్తిం చాలని. కొత్త వైరస్‌లను ఉత్పత్తిచేయాలని ఆదేశిస్తుంది. దేని బలం ఎక్కువైతే అది గెలుస్తుంది. వైరస్ బలం ఎక్కువైతే అది మొత్తం కణాన్ని, దానిలో జరిగే మెటబాలిజం (జీవరసాయనిక ప్రక్రియ)ను స్వాధీనం చేసుకుని, తనకు కావలసిన విధంగా మెటబాలిజం జరిగేట్టు చేస్తుంది. అంటే జీవకణం సరిగా తనను పోలిన రెండు జీవకణాలుగా చీలడానికి బదులు సుమారు మూడువందల వైరస్‌లను (అంటే న్యూక్లియో ప్రోటీన్లను) ఉత్పత్తిచేసి బద్దలై పోతుంది. (క్యాన్సర్‌వ్యాధికి కారణం వైరస్‌లేమోనని శాస్త్రజ్ఞులు అనుమానిస్తున్నారు).

ఇదీ వైరస్‌లకథ. దీన్ని ఇంత వివరంగా చెప్పడానికి కారణం వైరస్‌లు బహుశా సృష్టిలో కెల్లాఅతి ప్రాథమిక జీవ పదార్థాలు కావడమే. అవి న్యూక్లియో ప్రోటీన్లు మాత్రమే. అంటే చుట్టూ న్యూక్లియస్‌లేని క్రోమోజోములు మాత్రమే.

### ప్రప్రథమ జీవాలు?

బహుశా మొదటజీవం వైరస్‌లుగా ప్రారంభమై వుండవచ్చు. అంతేకాదు: బహుశా అవి కేవలం న్యూక్లిక్ యాసిడ్‌గా, అంటే వట్టి జీన్స్‌గా ప్రారంభమై వుండవచ్చు. ఆ తర్వాత ప్రోటీ న్లను కలుపుకుని న్యూక్లియో ప్రోటీన్లుగా ఏర్పడి వుండవచ్చు. తర్వాత వాటిచుట్టూన్యూక్లి యస్, తర్వాత సైటోప్లాజం, కణకవచం తయారైవుండవచ్చు. ఇదంతా మ్యుటేషన్స్‌వల్ల జరగడానికి వీలున్నది.

మ్యుటేషన్స్‌వల్ల కొత్త రకాల వైరస్‌లు ఏర్పడినప్పుడు నాచురల్ సెలెక్షన్ విధానంలో వాటిలో అర్హమైనవే వృద్ధి పొందుతాయి. మిగ కావి నశిస్తాయి. అలాఅలా ఏకకణజీవులు ఏర్పడి వుండవచ్చు.

ఏక కణజీవులనుంచి బహు కణజీవులు, వాటినుంచి వృక్షాలు, జంతువులు, మానవులు... ఈ పరిణామాన్ని వచ్చేవారం క్లుప్తంగా పరి శీలించి నరావతారం దగ్గిరికి వెడదాము.

(సశేషం)

"అధునాతన కుటీర పరిశ్రమలు" తెలుగు పుస్తకము. అనేక లాభదాయకమైన కుటీర పరిశ్రమల వివరములు వ్రాసినారు. దీనివలన చాలామంది ప్రతినెలా వేలకువేలుసంపాదించు చున్నారు. దీనియందు 224 పుటలు గలవు. వెల: రు. 10 అన్ని చేతిపనులు పేజీలు 464 వెల రు 16 తపాలా ఖర్చు రు 3—00

Cottage Industry (AJS-25)
P. B. NO. 1262, Anguri Bagh
Market. Delhi-6

దీర్ఘరోగులకు ఉత్తమ వైద్యము



హస్తప్రయోగం అవ యవము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి. శుక్ల నష్టము, నపుంస కత్వము, ఉబ్బసము (దమ్ము), బోదకాళ్ళు, కుష్ఠు, బొల్లి, చర్మ వ్యాధులు, కడుపునొప్పి, చెవుడు, పోస్టు ద్వారాకూడా చికిత్స చేయబడును.

శ్రీ బాలాజీ వైద్యశాల
డాక్టరు పి. కుమారస్వామి దేవర,
బ్రాంచెర్స్ జంగారోడ్, తెనాలి.